## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి


భూమిపూజ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పర్ణశాల/దుమ్ము గూడెం, మే 7: అర్హులైన వారికి ఖచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దుమ్ముగూడెం మండలంలోని చిన్నబండ్రేవు గ్రామ పంచాయతీలో రూ.7.5 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు, సింగవరం గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో సీఆర్ఆర్ నిధులతో నిర్మాణం చేపడుతున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న గ్రామాల ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని రోడ్ల సౌకర్యం కల్పించడంతో పాటు నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, హౌసింగ్ పీడీ శంకర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పేదల కోసమే సన్నబియ్యం : మంత్రి**

చర్ల, మే 7: నిరుపేదలకు ఆహారభద్రత కల్పించడమే తమ ధ్యేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆయన చర్ల మండలంలో పర్యటించారు. సుబ్బంపేట గ్రామంలోని గిరిజనుడి ఇంట సన్నం బియ్యంతో వండిన భోజనం చేశారు. సుబ్బంపేట పంచాయతీ కార్యాలయం, చర్ల లక్ష్మీకాలనీలోని గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రతి కార్యక్రమం వద్ద జనం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల విషయంలో మంత్రికి తమ గోడు వినిపించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి తేగడలో జరిగిన సర్వేలో వచ్చిన ఆరోపణలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూస్తానని పొంగులేటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో వి రాహుల్, ఆర్డీవో దామోదర్‌రావు, బాలసాని లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి

పర్ణశాల, మే 7: దుమ్ముగూడెం మండలంలోని పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు చిన్నబండిరేవు గ్రామంలో పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కారం పుల్లయ్య, యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, బొల్లి సత్యనారాయణ, కొమరం చంటి పాల్గొన్నారు.

**మంత్రిని కలిసిన గ్రామస్తులు**

మణుగూరు టౌన్, మే 7: మణుగూరు మున్సిపాలిటీలోని రాజుపేట, విఠల్‌రావు నగర్ గ్రామస్తులు, రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి విన్నవించారు. బుధవారం మణుగూరు ఇల్లెందు గెస్ట్‌హౌస్‌కు వచ్చిన మంత్రిని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య ఆధ్వర్యంలో కలిసి సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సరెడ్డి పుల్లారెడ్డి, దుగ్గ్యాల సుధాకర్, ఎడారి రమేష్, బోయిన వెంకన్న, రావుల రాములు, బొజ్జ సదానందం, రాజయ్య, సతీష్, అనిత, సుజాత పాల్గొన్నారు.

## మన్యం వీరుడు అల్లూరి వర్ధంతి


సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్, మే 7: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని క్షత్రియ సేవా సమితి సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మణుగూరు అంబేద్కర్ సెంటర్ పెట్రోల్‌బంక్ ఎదురుగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అల్లూరి విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో బొల్లోజు అయోధ్య, పిరినకి నవీన్, వివిధ పార్టీల నాయకులు, క్షత్రియ సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

భద్రాచలం, మే 7: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమించాలని ఆదివాసీ సమితి నాయకులు పాయం రవివర్మ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆదివాసీ సమితి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కుంజా ధర్మా, పూనెం వీరభద్రం, కోండ్రు సుధారాణి, వీసాల కృష్ణయ్య, కుంజా శ్రీను, ఇర్పా శ్రీను, రామ్మూర్తి, రాజేందర్ పాల్గొన్నారు.

## యాదవులు రాజకీయంగా అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న చలకాని వెంకట్ యాదవ్

భద్రాచలం, మే 7: యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ పిలుపునిచ్చారు. భద్రాచలం పట్టణంలోని రామాలయం రోడ్డులో శ్రీకృష్ణ మందిరంలో జరిగిన యాదవ సంఘం రాజకీయ అవగాహన తరగతుల్లో ఆయన మాట్లాడారు. యాదవులు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, నిరుపేద యాదవ విద్యార్థుల చదువు కోసం సంఘం ఆధ్వర్యంలో ఆర్థికంగా సహాయం చేయాలన్నారు. జెట్టి రామకృష్ణ యాదవ్, గోసుల శ్రీనివాస్ యాదవ్, సాయిరాం యాదవ్, సాంబశివరావు యాదవ్, శ్రీరాం యాదవ్, మల్లిబాబు యాదవ్ పాల్గొన్నారు.




## ఉపాధి పనుల పరిశీలన

అశ్వారావుపేట రూరల్, మే 7: మండలంలోని ఉట్లపల్లి, కేశప్పగూడెం, జమ్మిగూడెం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ఎంపీవో సీతారామరాజు బుధవారం పరిశీలించారు. ఈజీఎస్ ఏపీవో రామచంద్రావు, పంచాయతీ కార్యదర్శులు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.




# పంట మార్పిడితో అధిక దిగుబడులు

**వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్**


అశ్వారావుపేట: మాట్లాడుతున్న డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేట/దమ్మపేట రూరల్, మే 7: పంట మార్పిడితోనే రైతులు అధిక దిగుబడులు సాధించగలరని స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్ అన్నారు. ఎరువులను, పురుగు మందులను మోతాదుకు మించి వినియోగిస్తే ముప్పు మినహా ప్రయోజనం ఉండదని హెచ్చరించారు. అశ్వారావుపేట మండలం అచ్యుతాపురంలో, దమ్మపేట మండలం మారప్పగూడెంలో బుధవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని వ్యవసాయ కళాశాల, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించాయి. యూరియాతో అయ్యే అధిక ఖర్చులను, రసాయనిక ఎరువులతో కలిగే నష్టాలను హేమంత్ కుమార్ వివరించారు. సేంద్రియ ఎరువులతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ముఖ్యంగా భూమి ఆరోగ్యాన్ని కాపాడడం, పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత రైతులపై ఉందని అన్నారు. భూసార పరీక్ష నివేదికలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి రాకుండా, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు. కళాశాల సైంటిస్ట్ డాక్టర్ ఎస్.మధుసూదన్ రెడ్డి, ఏడీఏ రవికుమార్, ఏవోలు శివ రాంప్రసాద్, చంద్రశేఖర్ రెడ్డి, హెచ్‌వో వేణుమాధవ్, ఉద్యాన అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పాం రైతులకు పరిహారం చెల్లించాలి

**ఆయిల్ పాం గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు తుంబూరు ఉమా మహేశ్వర్‌రెడ్డి, కొక్కరపాటి పుల్లయ్య**


మాట్లాడుతున్న తుంబూరు ఉమా మహేశ్వర్‌రెడ్డి

అశ్వారావుపేట, మే 7: ఆయిల్‌ఫెడ్ సరఫరా చేసిన ఆఫ్ టైప్ మొక్కలతో నష్టపోయిన ఆయిల్‌పాం రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు తుంబూరు ఉమా మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి కొక్కరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. విత్తన చట్టం ప్రకారంగా బాధిత రైతులకు పరిహారాన్ని ఆయిల్‌ఫెడ్ చెల్లించాల్సిందేనని అన్నారు. ఆఫ్ టైప్ మొక్కల బాధిత రైతులతో వారు బుధవారం మండలంలోని నారంవారిగూడెం ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. జన్యు లోపమున్న మొక్కలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, 'వాటిని తొలగించి, కొత్తవి నాటుకోండి' అని సలహా ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సలహా ఇచ్చారు సరే.. పరిహారం సంగతేమిటి..?' అని ప్రశ్నించారు. ఐదు నుంచి ఎనిమిదేళ్ల వయసున్న తోటల్లో కల్లింగ్ మొక్కలను తొలగించి, కొత్తవి నాటుకోవడంతో ఒరిగే ప్రయోజనం ఏమీ లేదని అన్నారు. ఆయిల్‌ఫెడ్ సరఫరా చేస్తున్న ఆయిల్‌పాం మొక్కలకు గ్యారంటీ బాండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ''ఆయిల్‌పాం అనేది దీర్ఘకాలిక పంట. కనీసం నాలుగేళ్ల తర్వాతనే ఫలితాలు ఫలం అందుతుంది. నాలుగేళ్లపాటు సాగు చేసిన తర్వాత రైతులు నష్టపోతే.. దానికి బాధ్యత ఎవరిది..?'' అని ప్రశ్నించారు. ఆఫ్ టైప్ మొక్కలతో నష్టపోయిన వారికి సంబంధిత కంపెనీల నుంచి పరిహారం ఇప్పిస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. పరిహారం చెల్లించేలా ఆయిల్‌ఫాం చట్టాన్ని సవరించాలని సూచించారు. 2015 నుంచి 2022 వరకు రైతులకు మొక్కలు సరఫరా చేసిన అధికారులపై, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సంస్థను కోరారు. బాధిత రైతులకు పరిహారం చెల్లించకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బాధిత రైతులు పుచ్చకాయల సోమిరెడ్డి, దొడ్డా చక్రధర్‌రెడ్డి, చెల్లికాని సూర్యారావు, వెంకట్రావు, కారం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 7 : ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందిన ఘటన ఆంధ్రా-ఒడిశా బోర్డర్ ఏపీ రాష్ట్రం అల్లూరి జిల్లా సరిహద్దుల్లో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు(ఏఎస్ఆర్) జిల్లా వై-రామవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీస్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో 4ఏ గ్రేహౌండ్స్ యూనిట్ భద్రతా దళాలు యార్లగడ్డ పంచాయతీ పరిధి దూమకొండ అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా.. వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన గ్రేహౌండ్స్ బలగాలు ఎదురుకాల్పులకు దిగారు. భీకరపోరులో భద్రతా దళాల ధాటికి తాళలేక మావోయిస్టులు పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత గ్రేహౌండ్స్ బలగాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మృతి చెందిన ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతో పాటు రెండు ఏకే-47 ఆయుధాలు, ఇతర ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో రూ.20 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు కీలక నేత జగన్ అలియాస్ పండన్న, మరో మావోయిస్టు రమేష్ ఉన్నట్లు ఏఎస్ఆర్ జిల్లా పోలీస్ అధికారులు వెల్లడించారు.

**ఉప సర్పంచ్‌ని హత్య చేసిన మావోయిస్టులు**

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 7 : ప్రతీకారేచ్ఛతో రగలిపోతున్న మావోయిస్టులు ఓ గ్రామ ఉప సర్పంచ్‌ను దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా జగర్‌గూండ పోలీస్‌స్టేషన్ పరిధి తార్లగూడ ఆధారిత బెన్‌పల్లి గ్రామ ఉప సర్పంచ్ ముచకి రామ మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామీణ దుస్తుల్లో వచ్చిన సుమారు ఐదుగురు మావోయిస్టులు అతడిని ఇంట్లో నుంచి బయటకు బలవంతంగా లాక్కొచ్చారు. ప్రజలు చూస్తుండగానే అతడి గొంతు కోసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆలస్యంగా సమాచారం అందుకున్న జగర్‌గూండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రామ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రామ ఆ గ్రామానికి ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

# ధర్నా పోస్టర్ ఆవిష్కరణ


దమ్మపేట: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ములకలపల్లి, మే 7: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు అఖిల భారత ఐక్య రైతు సంఘం పిలుపు మేరకు ఈ నెల 8న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ధర్నా జరగనుంది. ఈ కార్యక్రమ ప్రచార వాల్ పోస్టర్‌ను రైతు సంఘం నాయకులు బుధవారం మండలంలోని చలమన్న నగర్, కమలాపురం గ్రామాల్లో ఆవిష్కరించారు. నకిరికంటి నాగేశ్వరరావు, ముదిగొండ మల్లయ్య, బండారు రామారావు, మడివి దేవయ్య, మడి సుక్కయ్య, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట, మే 7: ఇందిరాపార్క్ ధర్నా వాల్ పోస్టర్‌ను సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు బుధవారం దమ్మపేటలో ఆవిష్కరించారు. తోడం దుర్గమ్మ, పండూరి వీరబాబు, గంగాధర్, నాగమణి, జుంజునూరి ముక్తేశ్వరి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం

భద్రాచలం, మే 7: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం అంతరాలయంలో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనాన్ని వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వైద్య సేవలను మెరుగుపర్చాలి


మాట్లాడుతున్న డాక్టర్ భాస్కర్ నాయక్

కొత్తగూడెం టౌన్, మే 7: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ ఆదేశించారు. ఆయన బుధవారం వైద్యాధికారులు, పీహెచ్‌సీ పర్యవేక్షకులతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమావేశమయ్యారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, వ్యర్థాలను సమర్థవ నిర్వహణకు సోకేజ్ పిట్‌ల నిర్మాణం ఆవశ్యకతపై చర్చించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మధువరణ్, డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

## పర్ణశాల హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పర్ణశాల, మే 7: పర్ణశాలలో హుండీ ఆదాయాన్ని బుధవారం నిర్వహించారు. మొత్తం రూ.19,20,061 ఆదాయం వచ్చిందని, రెండు మలేషియన్ రింగిట్లు, ఫారెన్ కరెన్సీ రూపంలో వచ్చాయి. గత ఏడాది జూన్ 13వ తేదీన హుండీ ఆదాయం లెక్కించగా, అప్పటి నుంచి మొత్తం 328 రోజుల తర్వాత హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించామని ఆలయ అధికారి రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో భవాని రామకృష్ణారావు, శ్రీనివాస్, పర్యవేక్షకులు ఆలయ ఇన్‌చార్జి అనీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి అక్రమార్కులపై ఉక్కుపాదం

కొత్తగూడెం సింగరేణి/మణుగూరు టౌన్, మే 7: సింగరేణిలో అవినీతిపరులపై/అక్రమారులపై యాజమాన్యం ఉక్కుపాదం మోపింది. సంస్థలోని అవినీతిపరులు/అక్రమార్కుల సమాచారాన్ని బాధితులుగానీ, ఇతరులుగానీ విజిలెన్స్ విభాగానికి తెలపాలని కోరింది. పూర్తి ఆధారాలతో సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడంతోపాటు ప్రోత్సాహకరంగా రూ.10వేల పారితోషికం కూడా ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రకటన చేసింది. మెడికల్ బోర్డు ప్రక్రియలో అన్‌ఫిట్ చేయిస్తామని, బదిలీలు జరిపిస్తామని, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని, డిప్యుటేషన్లు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని.. ఇలా అమాయకులను అవినీతిపరులు/అక్రమార్కులు నమ్మిస్తున్నారని వివరించింది. వీరిపై, వీరికి సహకరిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు హెచ్చరించింది. వీరి సమాచారాన్ని విజిలెన్స్ విభాగానికి ఫోన్ నంబర్ 9491144104కు గానీ, మెయిల్ ద్వారాగానీ తెలపాలని కోరింది.

## నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

రామవరం, మే 7: సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు ఏరియా జీఎం శాలెంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కుటుంబాల్లోని, ప్రభావిత ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ (హైదరాబాద్) సహకారంతో డ్రై వాల్, ఫాల్స్ సీలింగ్ టెక్నీషియన్, వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ టెక్నీషియన్, ఆటో మొబైల్ అండ్ టూ వీలర్ టెక్నీషియన్, ఎక్స్‌వేటర్ ఆపరేటర్, ఫుడ్ బేవరేజ్ సర్వీస్ అసిస్టెంట్, ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషన్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ అండ్ హౌస్ వైరింగ్ టెక్నీషియన్ శిక్షణ ఉంటుందని వివరించారు. కోర్సునుబట్టి శిక్షణ కాలం ఉంటుందని పేర్కొన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 98661 17145 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

లక్ష్మీదేవిపల్లి, మే 7: మండల పోలీస్ స్టేషన్‌ను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్సై రమణారెడ్డిని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహనలో ముందుండాలని చెప్పారు. అనంతరం మండలంలోని వేపలగడ్డ గ్రామంలో సైబర్ జాగృతి కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులకుఅ వగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై రమణారెడ్డి, ప్రొబిషనరీ ఎస్సై విజయ సింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.,

## సంక్షిప్తం

### నేడు రుణ ఇంటర్వ్యూ

ఇల్లెందు, మే 7: రాజీవ్ యువ వికాస పథకంలో భాగంగా తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపికకు గురువారం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 11 గంటలకు మెప్మా కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు.

### వృత్తి శిక్షకులకు గౌరవ వేతనం అందజేత

కొత్తగూడెం సింగరేణి, మే 7: సింగరేణి కాలనీల్లోని సేవా సెంటర్లలో సేవాసమితి నిర్వహించిన వృత్తి విద్య శిక్షణ తరగతుల్లో బోధించిన శిక్షకులకు గౌరవ వేతనం చెక్కులను సింగరేణి జీఎం (పర్సనల్) జీవీ కిరణ్‌కుమార్ బుధవారం తన చాంబర్‌లో అందించారు. పర్సనల్ ఏజీఎం రాజేంద్ర ప్రసాద్, డీజీఎం ముకుంద సత్యనారాయణ, సీనియర్ పీవో శ్రీనివాసరావు, వెల్ఫేర్ పీఏ వరప్రసాదరావు, సేవా కో-ఆర్డినేటర్ ఇజాజ్ అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన

చంద్రుగొండ, మే 7: మండలంలోని మంగయ్యబంజర గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం భూమి పూజ, ఓ ఇంటికి శంకుస్థాపన చేశారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**పినపాక మండలంలో ..**

పినపాక, మే 7: మండలంలోని గొట్టెల్ల గ్రామంలో బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, అనర్హులకు ఇండ్లు మంజూరు అయినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో సునీల్ శర్మ, ఎంపీవో వెంకటేశ్వర్లు, స్పెషల్ ఆఫీసర్ తాతారావు పాల్గొన్నారు.

### సంత వేలం రూ.1.56 లక్షలు

అశ్వారావుపేట టౌన్, మే 7: స్థానిక వారపు సంతకు వేలం పాటను మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సుజాత వేలం బుధవారం నిర్వహించారు. రూ.1.56 లక్షలకు కాంద్రకోట ఉదయ్ కుమార్ పాడుకున్నారు. సంతలోని మార్కెట్ గదులను రూ.45,100కు కట్టా రాంబాబు, పేరాయగూడెం సమీపంలోగల కొబ్బరి తోటను రూ.73వేలకు దామెరశెట్టి ఫణీంద్రకుమార్ దక్కించుకున్నారు.

### ప్లాస్టిక్ వినియోగదారులపై చర్యలు

ఇల్లెందు, మే 7: నిషేధిత ప్లాస్టిక్ వినియోగదారులపై కఠిన చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ హెచ్చరించారు. మార్కెట్ ఏరియాలో బుధవారం ఐదు కిలోల నిషేధిత ప్లాస్టిక్ సీజ్ చేశారు. వినియోగదారులతో ఆయన మాట్లాడారు. నిషేధిత ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

### అనాథ శరణాలయాల సందర్శన

కొత్తగూడెం అర్బన్, మే 7: స్థానిక బూడిదగడ్డలోని స్నేహలత-సంధ్యాలత అనాథ పిల్లల ఆశ్రమాన్ని, సత్యసాయి అనాథ శరణాలయాన్ని, సఖి సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రాజేందర్ బుధవారం సందర్శించారు. అక్కడి సదుపాయాలను నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు.

### సింగరేణి రక్షణకు సమ్మె

టేకులపల్లి, మే 7: సింగరేణి రక్షణ, చట్టబద్ధత లేని నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు తదితర డిమాండ్లతో ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను సింగరేణి కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి కోరారు. మండలంలోని కోయగూడెం ఉపరితల గనిలో బుధవారం పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నాయకులు తాళ్లూరి కృష్ణ, రాజమొగిలి, జనార్దన్, రాజు, అబ్బాస్, సిరాజ్ అహ్మద్, వీరన్న పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో ఆవు మృతి

పాల్వంచ రూరల్, మే 7: మండలంలోని రంగాపురం గ్రామస్తుడు మాళోత్ బాబుకు చెందిన ఆవు బుధవారం ఉదయం శివారులోని పొలాల్లోకి మేతకు వెళ్లింది. మంగళవారం రాత్రి ఈదురు గాలులకు 11 కేవీ విద్యుత్ లైను తెగి పడింది. మేతకు వెళ్లిన ఆవు.. ఆ విద్యుత్ తీగలకు తగలడంతోనే షాక్‌తో చనిపోయింది. తమ కుటుంబ ఆధారం దూరమైనదంటూ బాబు దంపతులు రోదించారు.

### కలుపు మందు తాగి వ్యక్తి మృతి

కరకగూడెం, మే 7: మద్యానికి బానిసై మద్యం మత్తులో కలుపు మందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పీవీ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కొప్పు సతీష్ (34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య సంధ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు..?

అశ్వారావుపేట, మే 7: గంజాయి స్మగ్లర్లతోపాటు కొందరు వినియోగదారులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అశ్వారావుపేటలో గంజాయి విక్రయిస్తున్న ఏపీకి చెందిన నలుగురితోపాటు వినియోగదారులైన ముగ్గురు 'పేట' యువకులను విజిలెన్స్ అధికారులు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారని విశ్వసనీయంగా తెలిసింది. వీరి నుంచి సుమారు 15 కేజీల గంజాయి స్వాధీనపర్చుకున్నట్లు సమాచారం. దీనిపై సీఐ నాగరాజును 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. ధ్రువీకరించలేదు.

### జేసీబీ తగిలి వ్యక్తి మృతి

భద్రాచలం, మే 7: భద్రాచలానికి చెందిన ఇసుక వ్యాపారి అంబికావాసు ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యటపాక వద్ద పల్టీకొట్టిన లారీని లేపేందుకు జేసీబీ సహాయంతో తీస్తుండగా జేసీబీ తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. అంబికా వాసు పట్టణంలోని అందరికీ సుపరిచితులు.

**గోదావరి స్నానఘట్టాల వద్ద ఐరన్ మెష్‌ల చోరీ**

భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఉన్న ఐరన్ మెష్‌లను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ చోరీ చేసిన వారి కదలికలు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. కాగా దొంగతనానికి సంబంధించిన విషయమై గజ ఈతగాళ్లు స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారమిచ్చారు.

### చెట్టును ఢీకొట్టిన బైక్.. ఇద్దరికి గాయాలు

కరకగూడెం, మే 7: ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన ఎలబోయిన కళ్యాణ్(21), నవదీప్(20) ఇదే గ్రామం నుంచి కరకగూడెం గ్రామానికి ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తుండగా బైక్ అదుపు తప్పి గ్రామంలోని తాటిచెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కళ్యాణ్‌కు తీవ్ర గాయాలు కాగా నవదీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.